



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

మాస్టార్ల పిల్లలు... మెరిశారు..!

◆ ఎపి ఇఎపి సెట్‌లో అద్భుత ప్రతిభ

◆ జిల్లాలో వచ్చిన మూడు ప్రధాన ర్యాంకులూ ఉపాధ్యాయుల పిల్లలవే..

◆ ఇంజినీరింగ్‌లో పలు ర్యాంకులు కైవసం



విజయవాడలో ఎపి ఈఏపీ సెట్ ఫలితాలను విడుదల చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, చిత్రంలో అనంతపురం జెఎన్‌టియు విసి రంగజనర్ధాన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎపి ఇఎపిసెట్ పరీక్షా ఫలితాల్లో బడిపంతుల పిల్లలు అద్భుత ర్యాంకులు సాధించి మెరిశారు. ఉపాధ్యాయుల పిల్లలకు ప్రధానమైన ర్యాంకులొచ్చాయి. ఇంజినీరింగ్‌లో జిల్లా మొదటి ర్యాంకు, అగ్రికల్చర్‌లో రెండు ప్రధాన ర్యాంకులు ఉపాధ్యాయుల పిల్లలే ఉండటం గమనార్హం.

బాలికలదే హవా

ఇంజినీరింగ్ ఫలితాలు జిల్లాల వారీగా చూసినప్పుడు బాలికలే మెరుగైన ఫలితాలు సాధించారు. అనంతపురం, సత్యసాయి జిల్లా కలిపి ఇంజినీరింగ్ 11812 మంది హాజరయ్యారు. ఇందులో 8590 మంది క్వాలిఫై అయ్యారు. 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 6252 మంది హాజరయ్యారు. 4451 మంది ఉత్తీర్ణత సాధించారు. 71 శాతం క్వాలిఫై అయ్యారు. 5560 మంది బాలికలు హాజరయ్యారు. 4139 మంది క్వాలిఫై సాధించిన వారిలోనున్నారు. 74 శాతం మంది ఇంజినీరింగ్‌లో క్వాలిఫై అయ్యారు. అగ్రికల్చర్ విభాగంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 4935 పరీక్ష రాశారు. ఇందులో 4269 మంది క్వాలిఫై అయ్యారు. అనంతపురం జిల్లాలో 1305 మంది పరీక్ష రాశారు. ఇందులో 1128 మంది క్వాలిఫై అయ్యారు. 3214 మంది బాలికలు పరీక్ష రాయగా 2756 మంది క్వాలిఫై సాధించారు. సత్యసాయి జిల్లాలో బాలురు 98 మంది హాజరై 91 మంది క్వాలిఫై అయ్యారు. 325 మంది బాలికలు హాజరై 303 మంది క్వాలిఫై అయ్యారు.

ఇంజినీరింగులో 500 లోపు పది ర్యాంకులు

ఎపి ఇఎపిసెట్‌లో 500 ర్యాంకులోపు పది మంది ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యార్థులున్నారు. అనంతపురం నగరంలోని రామచంద్రనగర్‌కు చెందిన మేడాపురం లక్ష్మినరసింహ మాధవ భరద్వాజ్‌కు రాష్ట్ర స్థాయి ఎనిమిదవ ర్యాంకు సాధించారు. తాడిపత్రి జికె స్ట్రీట్‌కు చెందిన పొన్నతోట ప్రమోద కుమార్‌రెడ్డికి 28వ ర్యాంకు, ఆర్‌కె.నగర్‌కు చెందిన సొదుం లేఖనాకు 49వ ర్యాంకు, అనంతపురం నగరంలోని అశోక్ నగర్‌కు చిలంకూరు కుందన్ సాయికి 76వ ర్యాంకు, ఒవిఆర్ కాలనీకి చెందిన సురం సాయి స్వప్నిత్‌రెడ్డి 159వ ర్యాంకు, అంబటి రోషిత్ అభిరాంకు 217వ ర్యాంకు భూపతి నిఖిల్ అగ్నిహోత్రికి 325వ ర్యాంకు, నీలపరెడ్డి యశో శ్రీకర్‌ఆధిత్యరెడ్డికి 396వ ర్యాంకు, శీలం మైత్రేష్ బాబుకు 414వ ర్యాంకు, మట్లూరు అరుణ్ సుజిత్‌కు 422వ ర్యాంకు వచ్చింది. ఇక అగ్రికల్చర్‌లో 300 లోపే పది ర్యాంకులొచ్చాయి. అనంతపురం నగరంలోని జార్జీపేట్‌కు చెందిన జెరిపోతుల శ్రీవాత్సవ్‌రెడ్డికి 20వ ర్యాంకు వచ్చింది. కదిరి పట్టణంలోని అడపాల వీధిలో షేక్ ఫైజా సమ్రీన్‌కు 30వ ర్యాంకు వచ్చింది. అనంతపురం నగరంలోని లేపాక్షినగర్‌లో ఉంటున్న గంధమనేని గిరి వాత్సవ్, కంబదూరు విద్యా బొంధితకు 62వ ర్యాంకు, ధనకొండ చైతన్య 141వ ర్యాంకు జాగృతి బోడెద్దుల 176వ ర్యాంకు, గొల్ల జయవర్ధన్ 198వ ర్యాంకు, కమ్మర త్రిదేవ్ 206వ ర్యాంకు, ఎఎన్ ప్రవీణ్‌కు 252వ ర్యాంకు, తడల తరుణ్ 254వ ర్యాంకు వచ్చింది.

బడిపంతుల పిల్లలే...



మేడాపురం లక్ష్మి నరసింహ మాధవ భరద్వాజ్ (రాష్ట్ర 8వ ర్యాంకు)

రాష్ట్ర స్థాయి ఇంజినీరింగ్ టెస్టు (ఎపి ఇఎపిసెట్)లో బడిపంతుల పిల్లలకు మెరుగైన ర్యాంకులు వచ్చాయి. ఇంజినీరింగ్ విభాగంలో అనంతపురం నగరంలోని రామచంద్రనగర్‌లో ఉంటున్న మేడాపురం లక్ష్మి నరసింహ మాధవ భరద్వాజ్‌కు రాష్ట్ర స్థాయి 8వ ర్యాంకు వచ్చింది. ఇతనికి అఖిల భారత ఇంజినీరింగ్ పరీక్ష జెఇఇలోనూ 25వ ర్యాంకు వచ్చింది. తండ్రి సత్యనారాయణమూర్తి మెడికల్ ఏజెన్సీ నిర్వహుకుడు కాగా, తల్లి ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. హైదరాబాద్‌లో నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌ను భరద్వాజ్ పూర్తి చేశారు. తమ పిల్లాడికి రెండు పరీక్షల్లోనూ మంచి మార్కులు రావడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. అగ్రికల్చర్‌లో జిల్లాలో ప్రధాన ర్యాంకు సాధించిన జరిపోతుల శ్రీవాత్సవ్‌రెడ్డి తండ్రి మదన్‌మోహన్‌రెడ్డి, తల్లి భారతి ఇద్దరూ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. షేక్ ఫైజా సమ్రీన్ 30వ ర్యాంకు సాధించింది. ఈమె తండ్రి సలీమ్ బాషా కూడా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

రక్తదానంపై అపోహలొద్దు

కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రక్తదానంపై అపోహలు వీడి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఎదుట వారి ప్రాణాలు కాపాడాలని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పుట్టపర్తిలోని ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నాడు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ప్రమాదాలు జరిగినప్పుడు సమయానికి రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేస్తే ఒకరి ప్రాణాలు కాపాడిన వారు అవుతారన్నారు. 18 ఏళ్లు నిండిన ఎవరైనా రక్తదానం చేయవచ్చున్నారు. రక్తదానం ప్రాణదానం అన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. రక్తదానం వల్ల ఎటువంటి బలహీనత రాదన్నారు. ఒక వ్యక్తి నుంచి కేవలం 350 మిల్లీలీటర్ల రక్తాన్ని మాత్రమే సేకరిస్తారన్నారు. ఒక వ్యక్తి చేసే రక్తదానం ముగ్గురికి ప్రాణదానం అవుతుందన్నారు. రక్తదానం వల్ల రోగ నిరోధక శక్తిని పెంచుతుందని, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుందని, క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని చెప్పారు. అనంతరం మెగా రక్తదాన శిబిరంలో 75 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా॥ ఎస్‌వి.కృష్ణారెడ్డి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి నివారణ అధికారి డా॥తిప్పయ్య, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా॥కృష్ణయ్య, జిల్లా మలేరియా నివారణ అధికారి డా॥కుల్లాయప్ప నాయక్, జిల్లా అంధత్వ నివారణ అధికారి డా॥సి.అనురాధ, మెడికల్ ఆఫీసర్ డా॥నాగరాజు నాయక్, సూపర్‌వైజర్లు ఆర్.మురళీధర్ రెడ్డి, బి.అబిద్‌బాషా, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఈవి.రమణ, వై.రమేష్, వై.ఆంజనేయులు, బాషా, ఆరోగ్య సిబ్బంది రాజేశ్వరి పాల్గొన్నారు.

భూ సేకరణ త్వరగా పూర్తి చేయండి

జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

జిల్లాలోని వివిధ జాతీయ రహదారులకు భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులకు చేపట్టాల్సిన భూసేకరణపై బుధవారం నాడు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జెసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 544డి 342తో పాటు 716జి తదితర జాతీయ రహదారులకు భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఇందులో భాగంగా రైతుల బ్యాంకు అకౌంట్లు పుస్తకాల వివరాలు సేకరిస్తే త్వరగా వారికి పరిహారం అందించడానికి వీలు ఉంటుందన్నారు. ఆయా రహదారుల భూ సేకరణపై సంబంధిత అధికారులు ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. సకాలంలో రహదారులు నిర్మించడానికి అవకాశం ఉంటుందని రహదారులు ఏర్పడితే రవాణా సౌకర్యంతో పాటు ఆయా ప్రాంతాలు అభివద్ధి చెందుతాయని చేసి తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో భాగ్యరేఖ, సర్వే ఏడీ రామకృష్ణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, నేషనల్ హైవేస్ డిఈలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

రాగిపంట సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం

చిలమత్తూరు : రాగిపంట సాగుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహం అందిస్తోందని జెడిఎ సుబ్బారావు అన్నారు. ఈ మేరకు చిలమత్తూరు రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులకు రాగిపంటసాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జెడిఎ మాట్లాడుతూ ప్రభుత్వం విత్తనాలు 50 శాతం సబ్సీడీతో అందజేస్తుందని,పండిన పంటను సివిల్ సప్లే ద్వార మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులకు ప్రోత్సాహం అందిస్తుందని దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ అల్తాప్ అలీఖాన్, మండల వ్యవసాయశాఖ అధికారి వంశీకృష్ణ, తహశీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడిఎ

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి. గాండ్లపెంట

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ పి వి సిద్ధారెడ్డి అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని దోర్నాల జురుకువారిపల్లి. కట్టారుపల్లి క్రాస్. మాలపల్లి. సదలవాండ్లపల్లి తదితర గ్రామాలలో బుధవారం నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రజాసంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఈసందర్భంగా ఎమ్మెల్యే సంబందిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదవేంద్ర ఏపీవో మంజునాథ్. ఎంపిపీ జగన్మోహన్, వైసీపీ మండలకన్వీనర్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్యాయం చేస్తే ఆందోళనలు ఉధృతం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు మండలంలోని వివేకనంద డిగ్రీ కళాశాలను మూసివేసి విద్యార్థులను రోడ్ల పాలు చేయాలని చూస్తే భారత విద్యార్థి పెడరేషన్ ఆద్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఎస్ఎఫ ఐ మండల కార్యదర్శి జగదీష్ హెచ్చరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని వివేకనంద డిగ్రి కళాశాలలో బీఏ, బీకాం గ్రూపులలో సుమారు 170 మంది విద్యార్థిని విద్యార్థులు చదువుతున్నారన్నారు. గత 4 నెలలుగా అక్కడ పనిచేసే సిబ్బందికి జీతాలు చెల్లించలేదని అన్నారు. సిబ్బంది జీతాలు అడిగితే కళాశాల మూసివేస్తున్నట్లు కళాశాల యాజమాన్యం చెఽప్పిందని సిబ్బంది చెబుతున్నారని అన్నారు. దీంతో 170 మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారిందన్నారు. ప్రస్తుతం కళాశాలో చదువుతున్న విద్యార్థుల చదువు పూర్తీ అయ్యేవరకు కళాశాలను కొనసాగించాలన్నారు. లేదా వేరే కళాశాలలో జాయిన్ చేయించి పీజులతో పాటు విద్యార్థుల రాను పోను చార్జీలను యాజామాన్యం భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అమరీష్,సాయి,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చేగువేరా 95వ జయంతి

ప్రజాశక్తి -పెనుకొండ



చెగువేరా చిత్రపటం వద్ద నాయకుల నివాళి

పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో బుధవారం చెగువేరా 95 వ జయంతి ని నిర్వహజంచారు. ఈ సందర్భంగా అయన చిత్రపటానికి సీఐటీయూ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ చేగువేరాఅంటే ఒక విప్లవం, ఒక చైతన్యం అని అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని అణచివేతను యువత ప్రశ్నించడమే చేగువేరా జయంతి సందర్భంగా ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, సిఐటియు మండల నాయకులు తిప్పన్నా, మహబూబ్‌షా, మూర్తి, మహేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని కట్టడాలపై చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా అనుమతులు లేకుండా నిర్మాణం చేసిన అక్రమ కట్టడాలను గుర్తించి, వాటిపై చార్జ్ షీట్ ఫైల్ చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ప్లానింగ్ సెక్రటరీలను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ప్లానింగ్ సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సచివాలయాల వారిగా ఇప్పటి వరకు గుర్తించి అక్రమ నిర్మాణాల గురించి, వాటిపై తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. గుర్తించిన అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోక పోవడంపై అగ్రహం వ్యక్తం చేశారు. పురపాలక సంఘ వ్యాప్తంగా 43 సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ప్లానింగ్ సెక్రటరీలు ఆయా వార్డుల వాలంటీర్ల సాయంతో వారి పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలను గుర్తించాలన్నారు. వారిపై చార్జ్‌షీట్ ఫైల్ చేసి కోర్టుకు సమర్పించాలన్నారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్ల పేరుతో కారణాలు చెబితే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎసిపి ఆనంద్ కుమార్, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

సామర్థ్యం లేని బడిబస్సులను సీజ్ చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ప్రవేటు, కార్పోరేట్ పాఠశాల, కళాశాల నిర్వాహకులు నడుపుతున్న బస్సులను తనఖీ చేసి సామర్థ్యం లేని వాటిని సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఆర్‌టిఒ కార్యాలయంలో జిల్లా రవాణ శాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫిట్నెస్ లేకుండా నడుపుతున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులపైన చర్యలు తీసుకోవాలన్నారు. బస్సు పరిమితికి తగ్గట్లు విద్యార్థుల నుంచి బస్సు ఫీజు రూపంలో తీసుకుని, పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారన్నారు. అన్ని అంశాలపై సమగ్రంగా దర్యాప్తు చేసి, నిబంధనలు అతిక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయచంద్ర, తరుణ్, హర్ష కుమార్, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు



సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి రొద్దం

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు కూత వేట దూరంలో పెన్నానదిలో ట్రాక్టర్లతో గత వారం రోజులుగా ఇసుక తరలిస్తున్న విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు బుధవారం ఇసుక తరలింపును అడ్డుకుఆన్నరు. పెన్నా నదికి చేరుకుని ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకొని ఇసుక తరలించడానికి ఉన్న పర్మిషన్లను చూపించాలని ప్రశ్నించారు. వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు పెన్నా నదికి చేరుకుని ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ నాడు నేడు పనుల సాకుతో అనుమతి లేకుండా తురకల పట్నం గ్రామానికి చెందిన కొంతమంది ట్రాక్టర్లతో గత పది రోజుల నుంచి పట్టపగలే ఇసుక తరలిస్తున్నారని చెప్పారు. పెన్నా నదిలో ఇసుక తరలిపోతే రైతులకు చాలా నష్టం కలిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కావున అధికారులు రొద్దం చుట్టూ పక్కల ప్రాంతానికి మాత్రమే ఎద్దుల పనులతో తరలించడానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వేణు, రవికుమార్, పవన్, దేవరాజు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు

'అమ్మడెయిరీ' ఏర్పాటు అభినందనీయం

వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



అమ్మ డెయిరీ లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీ చరణ్, జిల్లా ప్రజాప్రతినిధులు



బహిరంగ సభలో సభలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో మహిళాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటును అందిస్తోందని అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి, రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పునరుద్ఘాటించారు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఆలమూరు వద్ద రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సారథ్యంలో ఏర్పాటు చేసిన తోపుదుర్తి మహిళా సహకార 'అమ్మడెయిరీ'ని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీచరణ్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో మహిళలు, ప్రజలను ఉద్దేశించి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రసంగించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పాడి రైతులు, మహిళలకు మేలు జరిగేలా రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మడెయిరీని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ప్రజల కోసం దీనిని ఆయన రూ.20 కోట్ల సొంత నిధులతో ఏర్పాటు చేశారన్నారు. ఇందులో మొత్తం 10 వేల మంది మహిళా సభ్యులు ఉండడం రాష్ట్రంలో ఇదే ప్రథమం అన్నారు. ప్రారంభంలోనే లక్ష లీటర్ల కెపాసిటీతో డెయిరీని ఏర్పాటు చేయడం సామన్యమైన విషయం కాదన్నారు. ప్రజలకు సేవ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని ఆకాంక్షించారు.

చంద్రబాబు రాజకీయంగా శక్తిహీనుడు

చంద్రబాబు నాయుడు రాజకీయంగా శక్తిహీనుడు అయ్యాడని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. ఎన్నికల్లో ఒంటిరి పోరాటం చేయలేక అందిరి సహకారం తీసుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. రాయలసీమకు ఎవరు ఎంత మేలు చేశారన్న విషయం ప్రజలకు బాగా తెలుసన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైసిపి ఒంటరిగానే పోటీ చేస్తుందని పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ ఫలాలు వచ్చే ఎన్నికల్లో వైసిపి మరోసారి అధికారాన్ని తెస్తాయన్నారు. అనంతరం జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి అమ్మడెయిరీ లోగాను మంత్రులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీలు వాల్మీకి మంగమ్మ, శివరామరెడ్డి, ఎమ్మెల్యేలు కాపు రామచంద్రారెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విత్తనషాపుల డీలర్లతో సమావేశం

తనకల్లు : మండలంలోని తనకల్లు-1 రైతు భరోసా కేంద్రంలో నందు ఎరువులు, పురుగు మందుల దుకాణాల డీలర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎఒ శ్రీహరినాయక్ మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం అనుమతించిన , ధ్రువీకరించిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను మాత్రమే ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిఘా కెమెరాలకు ఏర్పాటుకు సాయం

కదిరి టౌన్ : కదిరి ఆర్టీసీ బస్టాండు లో నిఘకెమెరాలకు మానిటర్ ను కదిరి డిపో కండక్టరు సి.సుబ్బరాయుడు తన సొంత డబ్బులతో డిపో మేనేజరు బి.మైనోద్దీన్‌కు కార్యాలయం లో అందజేసారు. ఈ సందర్భంగా కండక్టర్ మాట్లాడుతూ సంస్థ తనకేమి ఇచ్చినది కాకుండా, సంస్థ కోసం తానేమి చేసానో అనే విధంగా తనకు చేతనైనది చేశానన్నారు.ఈ సందర్భంగా కండెక్టర్‌ను డిపో మేనేజరు మైనోద్దీన్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమములో అసిస్టెంట్ డిపో మేనేజరు హరిమోహన్, బస్టాండు కంట్రోలర్ ఉత్తన్న, ఆఫీసు సిబ్బంది బాలునాయక్, శ్రీనివాసులు, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బుక్కపట్నం : మండలకేంద్రంలోని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థి విద్యార్థులు ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. అదేవిధంగా 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. నూతన విద్యా విధానంలో భాగంగా బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ మ్యాథ్స్ , బిఏ ఎకనామిక్స్ మైనర్ సబ్జెక్టుగా ఎంచుకొని నాలుగు సంవత్సరాలు కోర్సును పూర్తి చేసుకున్న వారికి బిఏ, బీకాం, బీఎస్సీ ఆనర్స్ గా గుర్తింపు లభిస్తుందని, మూడు సంవత్సరాల్లో డిగ్రీ పూర్తి చేసిన వారికి సాధారణ డిగ్రీ పొందవచ్చని తెలిపారు. నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ పూర్తి చేసిన వారికి నేరుగా పోస్ట్ గ్రాడ్యుయేట్‌లో రెండవ సంవత్సరం చేరి తప్పనిసరిగా 8 నెలల ఇంటర్ షిప్ పూర్తి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జులై నెల నాలుగో తేదీ నుంచి క్లాసులు ప్రారంభమవుతాయని కావున ఇంటర్ పూర్తయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

ధర్మవరం టౌన్ : కాంట్రీబ్యూషన్ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను పునరుద్దరించాలని ప్రభుత్వ ఉద్యోగులసంఘం సత్యసాయి జిల్లా అధ్యక్షుడు బాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆదేశాల మేరకు సత్యసాయి జిల్లా అధ్యక్షుడు బాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కళాజ్యోతిసర్కిల్ లోని. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ధర్మవరం తాలూకా అధ్యక్షుడు శివయ్య, జిల్లా ఉపాధ్యక్షులు వేమారెడ్డి, శ్రీనివాసులు, ఉదయకుమార్, తాలూకా కార్యవర్గసభ్యులు జయరాంనాయక్, రంగనాయకులు, చంద్రశేఖర్‌రెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పనితీరుతో ప్రజలకు మెరుగైన సేవలు

కదిరి టౌన్ : ఉత్తమ పనితీరుతో ఉద్యోగులు మెరుగైన సేవలు అందించాలని సిడిపిఒ రాధిక అన్నారు. బుధవారం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కుటాగుళ్ళ సెక్టార్ పరిధిలో గల కుటాగుళ్ల సెంటర్ 2 నందు జన భాగీ రాధి కార్యక్రమం నిర్వహించారు .ఇందులో భాగంగానే రెండున్నర సంవత్సరాలు పైబడి మూడేళ్ల లోపు గల పిల్లలను అంగన్వాడికి ఆహ్వానించే కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్ మమత, అంగన్వాడి యూనియన్ నాయకురాలు మాబున్నీసా , ఇందిరమ్మ, రామలక్ష్మి ,సుజాత పలువురు అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంయు నిరసన

ధర్మవరం టౌన్ : ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై ఆర్ఎం వైఖరికి నిరసనగా ధర్మవరం డిపో ఎన్ఎంయూ నాయకులు బుధవారం ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి జిల్లాలోని ఆయా డి. పోలలో యూనియన్ నాయకులు వెళ్లి సమస్యలను పరిష్కరిచాలని కోరగా అక్కడ అధికారులు ఏమిచేయలేని నిస్సాయస్థితిలో ఉన్నారని విమర్శించారు. ఈ నిరసనలో ఎన్ఎంయు జోనల్ నాయకులు వైజే ప్రేమకుమార్, రీజనల్ నాయకులు నీళ్లశంకరయ్య. దుర్గాప్రసాద్, డిపో అధ్యక్షకార్యదర్శులు ప్రభాకర్, మధుసూదన్, డిపో గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు డీఆర్ కుమార్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : జిల్లా కేంద్రమైన పుట్టపర్తి డిపోలో రీజినల్ కమిటీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ పిలుపుమేరకు ఉదయం 5 గంటల సమయంలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. డిపోలో నెలకొన్న ఉద్యోగుల సమస్యల మీద అనేకమార్లు జిల్లా ప్రజా రవాణా అధికారి గారి దష్టికి తీసుకెళ్లినప్పటికీ ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల మీద డిపోలలో అధికారులు ఏమి చేయలేని నిస్సహస్థితిలో ఉన్నారని విమర్శించారు. విధి లేని పరిస్థితులలో నిరసన తెలియజేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమైనదని డిపో నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ సెక్రటరీ శ్రీ రామ్ నాయక్, రీజనల్ కార్యదర్శి షబ్బీర్, చీఫ్ సలహాదారుడు అప్పిరెడ్డి, రీజినల్ ఉపాధ్యక్షులు తిరుపతమ్మ, రీజినల్ ట్రెజరర్ చంద్రాయుడు, అధ్యక్షుడు శివశంకర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి

ఓబుళదేవరచెరువు : టిడిపి అభివృద్ధికి కృషి చేస్తామని ఎస్సీ సెల్ కార్యదర్శి ముద్దలపల్లి శ్రీనివాసులు, టిఎన్‌టియుసి మండల కార్యదర్శి మండోజి చాంద్ బాషా, మైనార్టీ కార్యదర్శి మండోజి ఆరిఫ్ ఖాన్ అన్నారు. పు ట్టపర్తి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆదేశాల మేరకు పుట్టపర్తి నియోజకవర్గం ఎస్సీ సెల్ కార్యదర్శిగా ముద్దలపల్లి శ్రీనివాసులు, మరియు టిఎన్ టి యు సి మండల కార్యదర్శి మండోజి చాంద్ బాషా, మైనార్టీ కార్యదర్శిగా మండోజి ఆరిఫ్ ఖాన్ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధి అహర్నిశలు కృషి చేస్తామని అన్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే

చిలమత్తూరు : మండల పరిధిలోని కొడికొండ సెక్టర్ పరిధిలో భూమయ్య గారి పల్లి గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హిందూపురం ఐసిడిఎస్ సిడిపిఒ రెడ్డి రమణమ్మ. సూపర్వైజర్ సునీతబాయ్ హాజరయ్యారు. ఈసందర్భంగా చిన్నారులు పట్టుభద్రుల వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తి మున్సిపల్ నూతన కమిషనర్ గా మధుసూదన్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ శ్రీ లక్ష్మీ నారాయణ రెడ్డి, నెడ్ క్యాప్ డైరెక్టర్ మాధవ రెడ్డి, వైసిపి నాయకుడు కడప రాజా తదితరులు కమిషనర్‌కు స్వాగతం పలికారు. శాలువాలు కప్పి సత్యసాయి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కార్తీక్

ప్రజాశక్తి-హిందూపురం

ఆపద సమయంలో రక్తదానం చేయడానికి యువత పెద్ద ఎత్తున ముందుకు రావాలని సబ్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రభుత్వ అసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో రెడ్ క్రాస్ అధికారి జీబీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్తీక్ పాల్గొన్నారు. దాదాపు 55 సార్లు రక్తదానం చేసిన, 12000 మందికి రక్త దాతల ద్వారా రక్తదానం చేయించిన ఫ్రీడమ్ ఫైటర్ టిప్పు సుల్తాన్ మానవతా రక్త దాన సంఘం వ్యవస్థాపకులు ఉమర్ ఫారూక్ ఖాన్‌కుఉత్తమ రక్త దాతల పురస్కారాన్ని సబ్‌కలెక్టర్ చేతుల మీదుగా అందించి సన్మానించారు. అదే విధంగా ఎక్కువ సార్లు సార్లు రక్తదానం చేసిన వారిని ఈ సందర్భంగా సన్మానించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతు ప్రమాదాల్లో గాయపడిన వారికి, గర్భిణులకు, అనీమియాతో బాధపడుతున్న వారితో పాటు ఇతర అత్యవసర సమయాల్లో రక్తదానం చేసి ప్రాణాలను కాపాడి ప్రాణాదాతలుగా నిలచిన దాతల సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సుపరింటెండెంట్ డాక్టర్ రోహిల్, వైద్యులు ప్రశాంత్, సురేష్, దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు హనుమంతు, టిప్పు సుల్తాన్ రక్తదాన సంఘం షేక్ షబ్బీర్, నాజిమ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను నయవంచన చేస్తున్న వైసిపి

టిడిపి జిల్లా అధ్యక్షులు పార్థసారథి

ప్రజాశక్తి -పెనుకొండ

రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యా దీవెన,వసతి దీవెన, అమ్మ ఒడి పథకాల పేరుతో విద్యార్థులను నయ వంచన చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి విమర్శించారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షులు బి.కె . పార్థసారథి ఆధ్వర్యంలో ఫీజు ఎక్కడ కంసమామ అనే నినాదంతో టీఎన్ఎస్ఎఫ్ ఏర్పాటు చేస్తున్న కార్యక్రమానికి సంబందించిన పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ విద్యార్థుల తరపున పోరాడటానికి, జగన్ ను ఇంటికి పంపడానికి టీడీపీ సిద్ధంగా ఉందని తెలిపారు. బటన్ ల ముఖ్యమంత్రి మళ్లీ బటన్ నొక్కడానికి సిద్ధమయ్యాడని తెలిపారు. వసతి దీవెన పేరుతో మళ్లీ బటన్ నొక్కుడు కార్యక్రమం చేపట్టి ప్రజల్ని మోసం చేశారన్నారు. మభ్యపెడితే నమ్మడానికి ప్రజలు అమాయకులు కారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మునిమడుగు చిన్న వెంకటరాముడు,పట్టణ కన్వీనర్ రవి శంకర్,మండల తెలుగు రైతు సంఘం అధ్యక్షులు పోతిరెడ్డి,శ్రీ సత్యసాయి జిల్లా టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కురుబ జగదీష్, రాష్ట్ర కార్యదర్శి వినయ్ బాబు , ఉపాధ్యక్షుడు మురళి బాబు , ప్రోగ్రామింగ్ కమిటీ కోఆర్డినేటర్ వెంకటాపురం అభి , కార్యనిర్వహక కార్యదర్శి ఇర్షాద్ , అధికార ప్రతినిధి హరీష్, వినోద్ , లేపాక్షి మండల అధ్యక్షుడు దావూద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ప్రధాన ధ్యేయం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు విరివిగా మొక్కలు నాటి మానవ మనుగడకు ముప్పు లేకుండా చేయాలన్నదే గ్రీన్ భారత్ ముఖ్య ఉద్దేశ్యమని సంస్థ చైర్మన్ రెడ్డి వారి శంకర్ నారాయణ పేర్కొన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి గణేష్ కూడలి వద్ద బుధవారం గ్రీన్ భారత్ ఫౌండేషన్ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుమతి మెహత , డిసిసి అధ్యక్షులు కోటా సత్యం, జాతీయ మానవ హక్కుల సంఘం అధ్యక్షులు, భాస్కర్ నాయుడు , గార్మెంట్స్ సురేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు రెడ్డివారి శంకర్ నారాయణ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన అమెరికా, జపాన్ లాంటి దేశాలలో అక్కడ శ్రామికులు ఆక్సిజన్ క్లబ్బులను ఏర్పాటు చేసుకుని సేద తీర్చుకుంటున్నారని అలాంటి దుస్థితి భారతీయులకు రాకూడదని గ్రీన్ భారత్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. అందుకే ముమ్మురంగా చెట్లను నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా రెండు కోట్లు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నామనితెలిపారు. మండలాల వారిగా సంస్థ ప్రతినిధులు చొరవ తీసుకొని ఈ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. అంతేకాక చితికిపోయిన రైతును బతికించే కార్యక్రమం లో భాగంగా ఉపాధి హామీ పనులను రైతు పనులకు అనుసంధానం చేయాలని ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మిలిటరీ ఆదినారాయణ, అబ్దుల్ కలాం, బసంపల్లి నాగరాజు, కన్సల్టెన్సీ శ్రీరాములు, మాజీ మండల ఉపాధ్యక్షుడు సుధాకర్, అమగొండ పాలెం అమర్నాథ్ రెడ్డి, గార్మెంట్స్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాగిపంటసాగుపై అవగాహన

ప్రజాశక్తి - సోమందేపల్లి

మండల పరిధిలోని గుడిపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రంలో రాగిపంట విస్తీర్ణంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సివిల్ సప్లై కమిషనర్ అరుణ్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమైన ఆహారమని అందులో రాగులకు ప్రత్యేక ఆవశ్యకత ఉందని అన్నారు. నేడు దేశంలో అత్యధికంగా కర్ణాటక రాష్ట్రంలో రాగి పండుతుండగా తర్వాతి స్థానంలో ఉమ్మడి అనంతపురం జిల్లా ఉందన్నారు. ఇక్కడి వాతావరణం రాగి పంటకు అనుకూలంగా ఉంటుందని ప్రభుత్వం రాగి విస్తీర్ణం పెంచాలని ఉద్దేశంతో రైతులకు అనేక సదుపాయాలు కల్పిస్తోందని చెప్పారు. ప్రభుత్వం రాగులకు మద్దతు ధర కల్పించడమే కాకుండా అధిక దిగుబడినిచ్చే రాగి రకాలకు 50 శాతం రాయితీపై ఎకరాకు నాలుగు కిలోల విత్తనాన్ని సరఫరా చేస్తోందని చెప్పారు. అదేవిధంగా రాగి పంట సాగుకు పెట్టుబడి వ్యయం కూడా తక్కువగానే ఉంటుందని అన్నారు. అనంతరం రైతులకు రాగి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గిరిజమ్మ నాగరాజు రావ్, పంచాయతీ కార్యదర్శి నాగార్జున రెడ్డి, అగ్రికల్చర్ ఎడి స్వయంప్రభ, మండల వ్యవసాయ అధికారి కవిత రాణి, ఎఇఒ అలేఖ్య, సచివాలయ సిబ్బంది బాలకృష్ణ, శ్రీదేవి, నాగజ్యోతి, సబీనా, ప్రియాంక, బాబావలి, కులశేఖర్, విఆర్ఒ రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న అధికారులు

అక్రమ బదిలీలను ఉపసంహరించుకోవాలి

కదిరి టౌన్ : ఆర్టీసీలో జరిగిన అక్రమ బదిలీలు తక్షణమే ఆపాలనికదిరి డిపో సెక్రెటరీ బైరశెట్టి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కదిరి డిపో నందు డిపో సెక్రెటరీ బైరిశెట్టి ఆధ్వర్యంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేసారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లా ప్రజా రవాణా అధికారి ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. కదిరి డిపోలో అక్రమ చార్జిషీట్లు, బస్సుల కండిషన్లు,పెండింగ్ అరియర్స్, లీవుల డబ్బులు, అలాగే ఇటీవల ఇచ్చిన అక్రమ బదిలీలను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమములో రీజినల్ నాయకులు అశ్వర్థమయ్య, ప్రభాకర్ రెడ్డి,డిపో అధ్యక్షులు రామకృష్ణ, చైర్మెన్ నారాయణ స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓబులేసు, పులిశ్రీనివాసులు, రమణ, రవీంద్ర, పి.ఎం.ఖాన్,సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో రాణించిన విద్యార్థులు


సాయి స్వరూప్

బుక్కపట్నం : నీట్ ఎంట్రెన్స్‌లో గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచి తన సత్తా చాటాడు. మండల కేంద్రానికి చెందిన శ్రీనివాసులు కామాక్షిల కుమారుడు సాయి స్వరూప్ నీట్ పరీక్షల్లో 720 మార్కులకు గాను 629 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా విద్యార్థి మాట్లాడుతూ భవిష్యత్తులో వైద్యవృత్తి చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తన లక్ష్యమని తెలిపాడు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని గ్రామానికి చెందిన సాయి మంజునాథ్ కాలనీవాసులు ఎంకే లక్ష్మీనారాయణ ,కాంట్రాక్టర్ వెంకటేష్ తదితరులు అభినందించారు.

ఒబుల దవర్ చెరువు : నేషనల్ ఎలిజిబులిటీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(నీట్) లో మండలం లోని నల్లగుట్ట పల్లి గ్రామానికి చెందిన ఆర్ సత్యనారాయణ నాయక్ ఆర్ లక్ష్మీదేవిల కుమార్తె ఆర్ సౌజన్య బాయి రాణించింది. బుధవారం విడుదలైన నీట్ ఎంట్రన్స్ పరీక్షల్లో 720 మార్కులు గాను 397 మార్కులు సాధించింది. ఎస్టీ కేటగిరి కింద 4180 ర్యాంక్ పొందింది. విద్యార్థిని తల్లిదండ్రులు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా ఉంటూ సౌజన్య బాయి ను చదివిస్తూ వస్తున్నారు.

పుట్టపర్తి రూరల్: మెడిసిన్ ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన నీట్ ఏపీ, పీఏపీసెట్ పరీక్షలలో శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తికి చెందిన ఆర్టీసీ కార్మికుల పిల్లలు సత్తా చాటారు. బుధవారం వెలువడిన ఫలితాలలో పుట్టపర్తి మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఎస్‌వి నారాయణ రెడ్డెమ్మల కుమారుడు ఎన్ ప్రశాంత్ విజయవాడ వైష్ణవి అకాడమీలో ఇంటర్ చదివాడు, ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షల్లో 720 మార్కులకు గాను 636 మార్కులు సాధించి ఆల్ ఇండియా లెవెల్ లో 11158 ర్యాంకు సాధించాడు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఏపీ ఈఏపీఈ సెట్ లో 119 మార్కులు సాధించి 280 ర్యాంకు దక్కించుకున్నాడు. పుట్టపర్తి లోని గోకులానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ నూరుపాక పెద్దన్న రమణమ్మల కుమార్తె నూరుపాక సుష్మాంజలి విజయవాడ శ్రీ చైతన్య కాలేజీలో చదువుతూ నీట్ పరీక్ష రాయగా 520 మార్కులు సాధించి ఆల్ ఇండియా లెవెల్ లో 3185 ర్యాంకు సాధించింది. ఏపీ ఈఏసి సెట్లో 14 మార్కులు సాధించి సత్తా చాటింది.

నల్లచెరువు : మండల పరిధిలోని దామవాండ్ల పల్లికి చెందిన డేరంగుల తిరుపాల్, గిరిజ మొదటి కుమారుడు జశ్వంత్ రాజ్ 2023 నీట్ పరీక్షల్లో 547 మార్కులు సాధించి ఎంబిబిఎస్ సీట్ ను కైవసం చేసుకున్నాడు. ఈ విద్యార్థి విజయవాడలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్ మీడియట్‌లో 907 మార్కులు సాధించాడు,అలాగే అతని తమ్ముడు మోహన్ రాజ్ ఓడి చెరువు శ్రీవిజ్ఞాన్ స్కూల్లో పదవ తరగతిలో 562 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగిన పేద విద్యార్థి ఇంతటి విజయాన్ని సాధించటం ఎంతో సంతోషంగా ఉందని విద్యార్థి కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్.

పేద విద్యార్థులను తీర్చిదిద్దడమే ప్రభుత్వం లక్ష్యమని గ్రామ సర్పంచ్ నందిని తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం మండల పరిధిలోని బడన్నపల్లి గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను సర్పంచి చేతులమీదుగా పంపిణీ చేశారు. అదేవిధంగా అదేవిధంగా ఏడవ వార్డులో శివానగర్లోని ప్రాథమిక కొన్నత పాఠశాలలో కౌన్సిలర్ గడ్డం వరలక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జి రవీంద్రారెడ్డి, హెచ్ఎం లక్ష్మీనారాయణ చేతుల మీదుగా జగనన్న విద్యా కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో భాగంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు, ఈ కార్యక్రమంలో బడనపల్లిలో పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ లక్ష్మీదేవి, నాయకులు బడనపల్లి కేశవరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హరిబాబు, నాగేశ్వరి గోవిందు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రేణుక పాల్గొన్నారు. శివానగర్ లోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ రవీంద్రారెడ్డి, హెచ్ఎం లక్ష్మీనారాయణ, వైఎస్ఆర్ సీపీ నాయకులు గడ్డం రంగా తదితరులు పాల్గొన్నారు


జగనన్న విద్యా కిట్లను పంపిణీ చేస్తున్న గ్రామ సర్పంచ్ నందిని, బడన్నపల్లి కేశవరెడ్డి, హెచ్ఎం ముత్యాలప్ప


విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్న 7వ వార్డ్ కౌన్సిలర్ గడ్డం వరలక్ష్మి, హెచ్ఎం లక్ష్మీనారాయణ

నేరాలు ఘోరాలు

అంతర్ రాష్ట్ర దొంగలముఠా అరెస్టు

కళ్యాణదుర్గం: పలుప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను కళ్యాణదుర్గం పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు బుధవారం డీఎస్పీ శ్రీనివాసులు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 1, 9వ తేదీల్లో పట్టణంలోని ఎపిజిబి, యూనియన్ బ్యాంక్‌ల వద్ద డబ్బులు డ్రా చేసి వెళ్తున్న వారిని దొంగలు మభ్యపెట్టి రూ. 3.45లక్షల నగదు ఎత్తుకెళ్లారన్నారు. బాధితులు రవి, శంకరయ్య చేసిన ఫిర్యాదు మేరకు ప్రత్యేకబృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టామన్నారు. పలుప్రాంతాల్లో ఇదేలా చోరీలకు చేపడుతున్న పి.వినోద్, కే.సుబ్రహ్మణ్యం, తులసీధర్, పి.రమేష్ కళ్యాణదుర్గం మారుతీ వే బ్రిడ్జ్ సమీపంలో సంచరిస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన సీఐ తేజోమూర్తి, ఎస్‌లు నాగమధు, సుధాకర్, యువరాజు, మరో 20 మంది సిబ్బందిని అభినందించారు. పట్టణంలోని బ్యాంకులు, దుకాణదారులు తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ సూచించారు.

స్కార్పియోను ఢీకొన్న ఇసుక లారీ

పెద్దపప్పూరు : మండల పరిధిలోని తబ్బుల గ్రామ సమీపంలో బుధవారం తృటిలో పెద్ద ప్రమాదం తపింది. స్థానికుల కథనం మేరకు.. తాడిపత్రి నుంచి అనంతపురం వెళ్తున్న స్కార్పియో వాహనాన్ని పెద్దపప్పూరుకు వస్తున్న ఇసుక లారీ ఢీకొనడంతో ముందు భాగం బాగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అయితే ఈ మార్గంలో ఇసుక లారీలు అడ్డూ అదుపూ లేకుండా అతివేగంగా రాకపోకలు సాగించడం వల్లే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా పోలీసులు మేల్కొని ఇసుక లారీ డ్రైవర్లకు హెచ్చరికలు జారీ చేయాలని రహదారి పొడవు ఉన్న గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు

పెద్దపప్పూరు : పెళ్లికి వెళ్లి తిరిగి వస్తూ మార్గమధ్యలో మండల పరిధిలోని ముచ్చుకోట గ్రామ కొండల్లో బుధవారం కారు అదుపుతప్పి బోల్తా పడింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. యాడికిలో వివాహానికి హాజరై తిరిగి అనంతపురం వెళ్తుండగా ముచ్చుకోట కొండల్లో ఉద యం కారు బోల్తా పడింది. ఈ సంఘటనలో ముగ్గురు గాయపడగా స్థానికులు హుటాహు టిన ప్రయివేటు వాహనంలో అనంతపురం తీరలించారు. ఒకరి పరిస్థితి విషయంగా ఉండడం తో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకుపోయినట్లు సమాచారం. మెహరాజ్ కారు డ్రైవింగ్ చేస్తూ కునుకు తీయడంతోనే కారు ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది.


బిసిల ఆత్మీయ సదస్సులో పాల్గొన్న బత్తల హరిప్రసాద్, తదితరులు

బీసీల అభ్యున్నతికి కృషి

కదిరి టౌన్ : రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి కృషి చేద్దామని డాక్టర్ బత్తల హరిప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడలో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారేష్ సభాధ్యక్షతన జరిగిన బీసీ కులాల ఆత్మీయ సమ్మేళనంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరి ప్రసాద్ ,కదిరి నియోజకవర్గం సీనియర్ నేత డాక్టర్ బత్తల వెంకట రమణ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలను గుర్తించిన ఏకైక వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన ముఖ్య ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్యను డాక్టర్ బత్తల వెంకటరమణ,డాక్టర్ బత్తల హరి ప్రసాద్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, విజయవాడ నగర మేయర్,బీసీ సంఘం మహిళా అధ్యక్షులు బేబీ రాణి,మైనింగ్ డైరెక్టర్ బత్తల రామారావు,తుంబుక లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థికి ప్రోత్సాహకం

లేపాక్షి మండలం పరిధిలో ని చోళ సముద్రం జడ్పీ హైస్కూల్ నందు 10 వ తరగతి మొదటి ర్యాంకు సాధించిన, చోళసముద్రం,గ్రామం విద్యార్థి హర్షిని కి వైసిపి మండల నారాయణ స్వామి ప్రోత్సాహం అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థికి ఇచ్చిన మాటప్రకారం రూ. 10వేలను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బాణాల శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఆర్ఐ కేశవమూర్తి, మోహన్, ప్రధాన ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ

రొద్దం : మండలంలోని కలిపి ఎంపీపీస్కూల్‌లో కలిపి సర్పంచ్ కదిరిమ్మ, ఎంపీటీసీ, స్కూల్స్ కమిటీ ఛైర్మెన్ మురళి ఆధ్వర్యంలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నగేష్ తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

రొద్దం : మండలంలోని కలిపి ఎంపి పి ఎస్ పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులనూడు నేడు పనులను ఎంపీడీవో రాబర్ట్ విల్సన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కలిపి సచివాలయం, పెద్దమంతూరు ఆధార్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు నగేష్, ఆయా సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో మందుబాబుల వీరంగం

మడకశిర రూరల్ : మడకశిరలో మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారు. ఆంధ్ర బార్డర్ లోని కర్నాటకలో ముగ్గురు యువకులు మందు తాగి ఒక వ్యక్తిపై దాడి చేసి అనంతరం మడకశిర పట్టణంలోని రాజీవ్ గాంధీ సర్కిల్లో ఓ మహిళకు బైక్‌తో ఢీకొన్నారు. అనంతరం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి కారును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ఉన్న శివ అనే యువకుడు పరారయ్యాడు. సిద్దేశ్వర్ అనే యువకునికి కాలు, పవన్ అనే యువకునికి చెయ్యి విరిగింది.

ఘనంగా ఎత్నిక్ డే వేడుకలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎస్‌డిజిఎస్ కళాశాలలో ఎంబిఎ, బిబిఎవిద్యార్థులు వివిధ సంస్కృతుల, సాంప్రదాయాల సమ్మేళనం ఎత్నిక్ డే కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడే సంక్రాంతి, బతుకమ్మ పండుగలు, కేరళ సంప్రదాయం ప్రతిబింభించే ఓనం పండుగ, మహారాష్ట్ర మారతా సంస్కృతి కనువిందు చేసే గుడి పడ్వా పండుగలను, సంప్రదాయాలను కనులకు కట్టే విదంగా వస్త్రాధారణ, నాట్యాలతో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కళాశాల సెక్రటరీ బైసాని రాంప్రసాద్ మాట్లాడుతు భిన్నత్వంలో ఏకత్వం అన్న మన దేశ విశిష్టతను విద్యార్థులకు తెలియజేసి ప్రజలు ఐక్యతకు పాటుపడాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్ డాక్టర్ నాగేంద్ర కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, హెచ్ఒడి అనిల్ కుమార్, అధ్యాపకుల, విద్యార్థులు పాల్గొన్నారు.